# పడిలేచిన కెరటం

## - గంటి భానుమతి



*(గత సంచిక తరువాయి)*

"మేఘనా కాలేజీలో బిఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్నాడుట, పేరు రాయలేదు. ఓసారి చూడు నువ్వు గుర్తు పడతావేమో" అంటూ పేపరు నా చేతికివ్వ బోయింది.

" ఏదీ నన్ను చూడనీ "అంటూ నాన్నగారు అమ్మ చేతిలోంచి తీసుకున్నారు.

నా గుండె ఆగుతుందేమో అనిపించింది. మేఘనా కాలేజీ అంటే ఆర్ణవ్ చదివే కాలేజి. తను కూడా చదువుతున్నది బిఎస్సీ మూడో సంవత్సరమే, మొన్న సాయంత్రం నుంచి కనపడడంలేదు. సందేహం లేదు అన్నీకూడితే వచ్చే జవాబు ఆర్ణవ్.

అయితే తను చచ్చిపోయాడా! అది కూడా ఘోర ప్రమాదం.. రోడ్డు ప్రమాదంలో,

నమ్మశక్యంగా లేదు. ఆ చూపులు, మాటలు ప్రాధేయ పడతున్నఆర్ణవ్ మొహం కళ్ళముందు కనిపిస్తోంది. ఈ జరిగింది నా మూలంగానా! అమ్మ ఇంకా ఆ వార్త గురించి ఏదో అంటూనే ఉంది.

నాకే మాత్రం వినాలని లేదు. నా మాటలకి బాధపడి సుబ్బరంగా తాగేసి బైకు నడిపించాడా? అది యాక్సిడెంటా? కావాలనా? ఆత్మహత్య చేసుకున్నాడా? "అయినా నేనేం అన్నాను ? స్నేహానికి ప్రేమకి మధ్య ఉన్న తేడా నీకు తెలీలేదు. స్నేహం వేరు. ప్రేమ వేరు" అని అన్నాను. అంతే. "ఆర్నవ్ అంటే ఇష్టమే కాని అది ప్రేమ వరకూ రాలేదని" అని అన్నాను. కాని,వచ్చిందని తను అన్నాడు. నేను అది ప్రేమ కాదని అన్నాను. అది ప్రేమే అని అన్నాడు. నేను తిరస్కరించాను. అయితే దానికి ఇంతగా తాగి నడపాలా తనకి తానే ఇలా చేసుకుంటాడా! నా మూలంగా పోయాడని తెలిస్తే,నన్ను పోలీసులు పట్టుకుంటారు. జైల్లో పెడతారు.భయంతో వణికి పోయాను. నాకేం తెలీనట్లుగా ఉండి పోతాను. అది తప్పని తెలుసు. కాని నేను నిస్సహాయురాలిని. ఇప్పుడు ఉన్న కష్టం అంతా నాకేం కావాలో తెలుసు.

"ఏదీ ఆ పేపరిల్లా ఇయ్యి. ఆ అబ్బాయి ఎవరో చూస్తాను " అంటూ నాన్నగారి చేతిలోంచి తీసుకున్నాను. ఫొటో అస్పష్టంగా ఉంది. కాని ఆ బైకు ఆర్నవ్ దే. ఆ బైకు మీద కూచుని డిసెంబర్ ముప్పై ఒకటో తారీఖు రాత్రి రిసార్ట్ కి వెళ్ళాను. అందుకే గుర్తు పట్టగలిగాను. ఓ పక్కగా పడిపోయిన బైక్, కాస్త దూరంగా రక్తం మడుగులో ఆర్ణవ్. అంటే మొన్న రాత్రి యాక్సిడెంట్ అయిందన్న మాట, నిన్న ఆసుపత్రి కి తీసుకెళ్ళి ఉంటారు. అందుకని ఇవాళ్టి న్యూస్ లో వచ్చింది,ఆ బైక్ ని గుర్తు పట్టి,వెతికారుట, మేఘనా కాలేజీ లో బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి. పేరు ఆర్ణవ్ , అమ్మ నా వైపే చూస్తోంది నానుంచి ఏం సమాధానం వస్తుందా అని కావచ్చు.

“ఆర్ణవ్, పేరు బాగా విన్నాను. నా క్లాస్ మేట్ సువర్ణకి చుట్టం. అంతే తెలుసు. ఈ అబ్బాయిది ఏ కాలేజియో నాకు తెలీదు. కానీ,నేను ఈ అబ్బాయిని చూసాను. ఓ యూత్ ఫెస్టివల్ లో సువర్ణ చూపించింది. అంతే,అంతకన్నా ఎక్కువ పరిచయం లేదు ” అంటూ పేపర్ని అమ్మ చేతికి ఇచ్చి, నన్ను నేను కంట్రోల్ చేసుకుంటూ అన్నాను. నాకు తెలీదని ఎంతగా అబద్దం,ఎంత సులభంగా ఆడేసాను.

గదిలోకి వెళ్లి మంచం మీద కూచున్నాను. గుండె చాలా స్పీడుగా కొట్టుకుంటోంది. నొప్పి,భరించలేని నొప్పి,మనసంతా మొద్దు బారిపోతోంది. సువర్ణ ని కలుసుకోవాలి. నా తప్పేం లేదని చెప్పుకోవాలి,కాని ఆమెని నమ్మించగలనా! నమ్ముతుందా!నమ్మినా నమ్మకపోయినా తనకి జరిగినది చెప్పాల్సిందే. ఈ గుండె బరువుని నేను మోయలేను. నా వల్ల కావడం లేదు. అమ్మకి చెప్పాను సువర్ణని కలుసుకోడానికి వెళ్ళాలని . అమ్మ సరే తొందరగా వచ్చెయ్యి అని అంది.

ఆమెని కలుసుకోడానికి హాస్టల్ కి వెళ్ళాను. ఆమె కూడా నా కోసం ఎదురు చూస్తున్నట్లుగా ఉంది.ఇద్దరం హాస్టల్ బిల్డింగ్ దాటి కొంచెం దూరం నడిచి, ఎవరూ లేని చోట కూచున్నాం. ఆ వెంటనే ఏడ్చేసాను. కట్టలు తెంచుకుంటూ ఏడుపు వచ్చేస్తోంది . మధ్య మధ్య అంతకు ముందు నాకూ ,ఆర్నవ్ కి జరిగింది చెప్పాను. ఆమె నన్ను ఓదార్చింది.

“నువ్వేం మాట్లాడకు . ఏం జరుగుతుందో చూద్దాం . నీకేం కాదు ధైర్యంగా ఉండు”

“థాంక్యూ,సువర్ణా కాని ఒక్కటి చెప్పు, నేను స్వార్ధంగా ప్రవర్తించానా! బామ్మ దగ్గరికి వెళ్ళి నా మూలంగానే పోయాడు . అని అనాలా , నేను స్వార్ధపరురాలినా!”

“నువ్వు స్వార్ధపరురాలివి కాదు శృతీ, నిజమైన స్వార్ధపరుడు ఆర్ణవ్. తను అనుకున్నది ఆ క్షణాన దొరక్కపోతే అది శాశ్వతం కాకపోతే ఇంక అంతే . అంతగా తాగెయ్యాలా, తన విలువైన జీవితాన్ని కూడా లెక్కచెయ్యలేదు. ఇందులో నీ తప్పేం లేదు ”అని ఇంకా ధైర్యం నూరి పొయ్యడానికి ప్రయత్నించింది.

నేను పైకి గంభీరంగా ఉన్నా, లోపల భయం దొలిచేస్తోంది. పోలీసులకి తెలుస్తుందా? తెలుసుకుంటారా? యాక్సిడెంటుకి ముందు నన్ను కలిసాడని, నాతో మాట్లాడాడని, ఆ విషయం ఎవరు చెప్తే తెలుస్తుంది బామ్మ. అవును ఆమె చెప్తేనే తెలుస్తుంది . ఆమెకే తెలుసు ఆర్ణవ్ ఆ సాయంత్రం నాతో మాట్లాడాడని. ఆమె చెప్తుందా? తప్పకుండా చెప్తుంది. సువర్ణ ఎంత ధైర్యం చెప్పినా, భయపడుతూనే ఉన్నాను. ఇంటికి ఎలా వచ్చానో తెలీదు.

ఎందుకైనా మంచిదని ఇంటికెళ్ళాకా ఆర్నవ్ ఇంటికి ఫోన్ చేసాను. ఎప్పటిలాగే వాళ్ళ బామ్మ తీసారు. నేనెవరో చెప్పాకా ఆమె మొదట మాట్లాడ లేదు. ఆ తర్వాత నోరు విప్పింది.

“నాకు తెలుసు వాడు నిన్ను ప్రేమించాడని కానీ మీ ఇద్దరి మధ్య ఏం జరిగిందో నాకు తెలీదు. వాడి ప్రేమని తేలిగ్గా తీసుకున్నావు. ఆ సంగతి నీ మనసుకి తెలీదా. తెలుసు.వాడు నిన్ను ఇష్ట పడుతున్నాడని తెలుసు. నీ వైపు నుంచి ఆలోచిస్తే నీది కూడా తప్పులేదు. ఈ వయసులో ప్రేమని, పెళ్ళిని నేను ప్రోత్సహించను. అలా అని మా వాడిని తప్పు పట్టను. తల్లీ తండ్రీ దగ్గర పెరగ లేదు. అందుకే వాడిలో మానసిక పరిపక్వత కన్నా అమాయకత్వమే ఎక్కువ ఉంది. వాడు అమాయకుడు, బలి అయిపోయాడు. వాడి సంగతి వదిలెయ్,నీ సంగతి. ఒక్కసారి నీ మనసులోకి తొంగి చూడు. వాడి మాటలు ,అన్నీ ఒక్కసారి గుర్తు తెచ్చుకో, అందులో అంతా వాడి ప్రేమ కనిపిస్తుంది. మమత

వినిపిస్తుంది. అయినా తల్లీ ఇతరుల మనసుని చూడడానికి వెలుగు కావాలి. కాని మనల్ని మనం చూసుకోడానికి అక్కర్లేదు. ఎంత చీకటిలో అయినా  చూసుకోగలం. మనలోకి మనం ప్రయాణం చెయ్యడమే ఆత్మజ్ఞానం . ఒక్కొక్కసారి ఇది ఎంతో అవసరం.

ప్రేమని ప్రేమికుడిని తేలిగ్గా చూడకు. అది నువ్వు చేసావు. నీ వైపునుంచే చూసావు, నీ స్వార్థం నువ్వు చూసుకున్నావు. వాడి గురించి అసలు ఆలోచించలేదు. వాడు నిన్ను కలుసుకోడానికి వెళ్తున్నానని నాతో అన్నాడు. ఆ సంగతి నాకు తెలుసు,తల్లి  , చిన్నప్పటి నుంచీ ఎవరి ప్రేమ పొందలేదు. తల్లీ తండ్రీ విడిపోయారు. ఆ ఇద్దరూ కూడా వాడిని వద్దనుకున్నారు. మనవడి మీద ప్రేమతో నేనే వాడిని పెంచాను. అందుకని ప్రేమ అన్నది అసలు మొదట్నించీ లేదు. నువ్వు మాట్లాడుతూంటే అదే నిజమైన ప్రేమ అనుకున్నాడు.

మీ ఇద్దరూ అక్కడ ఏం మాట్లాడుకున్నారో  తెలీదు. కానీ ఏం జరిగిందో ఊహించ గలను. ఇది యాక్సిడెంటు కి కారణం అయింది.  ఆ సంగతి నేను ఊహించ గలను. వాడిని పెంచడంలో నాతప్పు ఎంతుందో ఎక్కడుందో నాకు తెలీదు. కొడుకూ కోడలూ లేరు,.ఇప్పుడు మనవడు కూడా " అంటూ ఆవిడ ఏడ్చేసింది. టక్కున ఫోను పెట్టేసింది.

అది యాక్సిడెంటు అని ఆమె అనుకోడం లేదు. నా మూలంగానే ఆ యాక్సిడెంటు జరిగిందనుకుంటోంది. అదే నిజమా! నేనే తన మరణానికి కారణమా! బామ్మ మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి. ఆ ఏడుపు నా హృదయాన్ని గుచ్చి గుచ్చి పెట్టింది.  నేను నాస్వార్థం చూసుకున్నానని ఆవిడ అన్నారు. మనం బావుండాలంటే ఎదుటి వాడు నాశనం కోరుకోనక్కర్లేదు. ఆమె మాటల్లో ఆ అర్థం వినిపించింది. కాని నేను ఆర్ణవ్ నాశనం కోరుకోలేదు. నా జీవితం ఎలా ఉండాలో ప్లాన్ వేసుకోడంలో తప్పు ఏం లేదు. నా కలలని మా పేరెంట్స్ ఆశయాలని నిజం చేసుకోవాలనుకున్నాను. ఆర్ణవ్ నన్ను సరిగా అర్థం చేసుకోలేదు.

తల్లి దండ్రి లేని ఆర్ణవ్ ని బామ్మ పెంచింది. ఆమె ప్రపంచం అంతా ఆర్ణవ్, మరి ఆర్ణవ్ కి ఆమె అంతా కాదా? ఆమె గురించి ఆలోచించలేదా? తను లేకపోతే ఆమె ఏమవుతుంది? అన్న ఆలోచన రాలేదా? చచ్చి నన్ను సాధించాలనుకున్నాడా ఎన్నో ప్రశ్నలు. జవాబులు దొరకని ప్రశ్నలు. తలుచు కుంటున్నకొద్దీ భయం వేస్తోంది. అమ్మా వాళ్ళకి తెలిస్తే. అసలు తెలిసే అవకాశం ఉందా.

ఆరోజు అంతా ఈ విద్యార్థులూ, స్నేహాలూ, విచ్చలవిడితనాలూ, స్వేచ్ఛనిచ్చేసిన తలిదండ్రులు, చేతినిండా డబ్బులూ, పబ్బులూ, తాగుడు ,చెడు అలవాట్లు, చేతిలో వెహికల్స్, రోడ్డు రూల్స్ పట్టించుకోని యువకుల గురించి , లైసెన్స్ లేకుండా బైకులు నడిపే పిల్లల గురించి రోడ్డు ప్రమాదాల గురించి  , ఇంట్లో వాళ్ళ పెంపకం గురించి,  మొగపిల్లల మైండ్ సెట్ గురించి, టీవీలో దాదాపు అన్ని చానెళ్ళల్లో దీనిమీదే చర్చలు , దాన్ని అమ్మా వాళ్ళూ ఎంతో ఆతృతగా చూస్తూ, వింటూ ,మధ్య మధ్య  పిల్లల్లో డిసిప్లీన్ లేదంటూ,  అలా పెంచిన పేరెంట్స్ ని తిడుతూ చూస్తున్నారు . అంతలోనే ఆర్ణవ్ ఇల్లు, మీడియా మనుషులు ఆ ఇంట్లోకి వెళ్తున్నారు. వాళ్ళ బామ్మని చూపించారు. ఆమెని  ఛానెల్స్ వాళ్ళు ఏవేవో ప్రశ్నలు అడుగుతున్నారు.

ఆమె ఏం చెప్పడంలేదు. అంతలో పోలీసులు కూడా వచ్చారు. టీవీలో ఆమెతో మాట్లాడుతున్నారు. ఆమెని ఎన్నో ప్రశ్నలు వేసారు. ఆమె మాడ్లాడుతున్న ప్రతీ మాట నన్ను గుచ్చేస్తోంది. ఆఖరికి అడిగేసారు.  "ఏదైనా ప్రేమ వ్యవహారమా!ఎవర్నైనా ప్రేమించాడా? " నా గుండె దడదడ లాడింది. ఊపిరిని ఆపేసాను. కళ్ళు విప్పార్చుకుని బామ్మనే చూస్తున్నాను.

"లేదు , నాకు తెలిసినంత వరకూ ఎవర్నీ ప్రేమించలేదు. వాడు అలాంటి వాడు కాదు "

మనసులో ఏడ్చేసాను. నాకు తెలుసు ఆవిడ అబద్ధం చెప్తోంది. నా పేరు బయటికి రావడం ఆమెకి ఇష్టం లేదు. ఆవిడ సంస్కారానికి ఇంకా ఏడుపొచ్చింది.

"బామ్మగారూ, ఇది చెప్పండి,యాక్సిడెంటు జరిగిన రోజు బాగా తాగాడని తెలిసింది. రోజూ తాగుతాడా?"

ఆమె చాలా ఇబ్బందిగా చూసింది.

" కుర్రాడు కదా,ఏదైనాఎప్పుడైనా పార్టీలో స్నేహితులతో, అది కూడా ఎప్పుడైనా,అంతే. తాగుబోతు మాత్రం కాదు. అంతకన్నా నాకేం తెలీదు "

" అంతకు ముదు రోజుఏదైనా పార్టీ ఉందా, ఎవరిని కలుసుకోడానికి వెళ్ళాడు అంటే "

" ఏమో నాకేం తెలీదు,నాకేం చెప్పలేదు " ఆమె అనేసిది.అలా అంటూంటే నా గుండె మెలిపడింది.

" బామ్మగారూ, మీకు తెలీక పోవచ్చు, మీకు చెప్పలేదేమో, ఎక్కడో ఏదో పార్టీ అయి ఉంటుంది. అక్కడ బాగా తాగి ఉంటాడు, సాధారణంగా బాగా తాగి నడిపితేనే ఇలాంటివి జరుగుతూంటాయి" అని అన్నా కూడా వాళ్ళకి నా పేరు చెప్పలేదు. నన్ను కలుసు కోడానికి వెళ్ళాడని చెప్పలేదు. అలాంటివి ఏం లేదు. అన్న స్టేట్ మెంట్ ఇచ్చింది.

బామ్మ అన్నట్లు నాలో ఇంత స్వార్ధం ఉందా? నాదే చూసుకున్నానా? బామ్మ మనసుని అసలు చూడలేదు.ఓ ముసలి మనసుని ఎంతో కష్ట పెట్టాను. ఆలోచిస్తే బామ్మని కష్ట పెట్టింది ఆర్ణవ్.ఆమెని ఆమె మనసుని చూడలేదు. ఆమెగురించి ఆలోచించలేదు.

పోస్ట్ మార్టం రిపోర్ట్ వచ్చింది. ఆల్కహాల్ ఎక్కువ తీసుకోడం వల్ల బైక్ అదుపు తప్పి, రోడ్డు మధ్య నున్నడివైడర్ కి కొట్టుకోడం వలన ప్రమాదం జరిగింది.

ఆ మర్నాడు అంత్యక్రియలు,అందరూ వెళ్తూ నన్నూ రమ్మన్నారు. కానీ స్మశానికి నేను వెళ్ళలేదు. ఓ ముద్దలా అయిపోయిన ఆర్నవ్ ని చూడలేను అని తప్పించుకున్నాను. నేను కారణం కాకపోయినా నామూలంగా ఓ మనిషి పోయాడు. ఓ విధంగా నేను ఓ హంతకురాలినే. అతనూ అతని మాటలూ అన్నీ నాకు గుర్తు.

అయినా ఎందుకంత తాగాడు? నా మూలంగానా? ఎందుకంత పిచ్చి పని చేసాడు? జరిగింది ప్రమాదమా? కావాలని చేసినదా? ఏదైనా కాని,ఎన్ని ప్రశ్నలు వేసినా దానికి వచ్చే సమాధానాలు అన్నీ కూడా నన్నే తప్పు పడుతోంది. నేనే దోషి అని చెప్పకనే చెప్తోంది. నేనే కారణం అని అనిపిస్తోంది.

కాని నేను నిశ్శబ్ధంగా ఉండి పోయాను. నన్ను నేను దోషిని అని అనుకోకుండా తన ఛావుకి కారణం, అని నేను అనుకోకుండా ఉండాలంటే నేను ఏం చేసి ఉండాల్సింది. అసలు నేను ఏం చేసి ఉండచ్చు. ఏం మాట్లాడి ఆర్నవ్ కి సమాధానం ఇవ్వచ్చు.

సరే అని అనాలా ,లేకపోతే నేను కూడా నిన్ను ప్రేమిస్తున్నాను అని అనాలా? నేను హైద్రాబాదు వెళ్ళను, ఇక్కడే హాస్టల్ లో ఉంటాను. మనం ఎక్కడో ఓ చోట కలుసుకుందాం. అని అనాలా? కాని అలా అని అనలేదు. ఎలా అంటాను.? అవన్నీ మనసులోంచి రావాలి

కదా. నాకు రాలేదు. ఎందుకంటే.. ఆర్ణవ్ కన్నా నా కలలు, నా ఆశయాలు, ఆశలు, నా పేరెంట్స్ ఎక్కువ కాబట్టి. ఆర్ణవ్ అంటే ఇష్టం అది కూడా, ఓ మంచి స్నేహితుడిగా మాత్రమే.

అయినా ఓ రెండేళ్ళ పరిచయం ప్రేమకి సరిపోతుందా? ఆ పరిచయం ఓ మనిషిని అర్థం చేసుకోడానికి చాలా, పెళ్ళికి అది చాలా, అందులో జీవితాంతం కలిసి ఉండాల్సిన మనిషితో.

ఆ మర్నాడు హైదరాబాదు కి వెళ్ళిపోయాం. ఊరు మారాం కాబట్టి అన్ని సద్దుకుంటాయనుకున్నాను. ఆర్నవ్ అధ్యాయం ముగిసిపోయింది అని అనుకున్నాను. కాని నేను తప్పు. ప్రతీరోజు ప్రతీ క్షణం గుర్తొస్తున్నాడు. అతని జ్ఞాపకాలు దొలిచేస్తున్నాయి. రాత్రిళ్ళు నిద్ర పట్టడం లేదు. ఒకవేళ పట్టినా మధ్య మధ్య ఉలిక్కిపడి కూచుంటున్నాను. తెలీకుండానే గట్టిగా ఏడ్చేస్తున్నాను. ఎక్కడో ఓ మూల కూచుంటున్నాను. ఎవరితో మాట్లాడాలనిపించడం లేదు. నాలోని మార్పుని అమ్మ గమనించ లేదు. అమ్మ బలవంతం మీద ఎంసెట్ కి తయారవుతున్నాను. ఎంత బిజీగా ఉండి చదువుతున్నా కూడా చచ్చి పోయిన ఆర్ణవ్ జ్ఞాపకాలనుంచి పూర్తిగా కోలుకోలేక పోతున్నాను.జరిగినది మర్చిపోలేక పోతున్నాను.

మళ్ళీ ఎంసెట్ రాసాను. మంచి రాంకే వచ్చింది. కానీ మెడిసిన్ లో సీటు రాలేదు. ఫిజియోథెరపీ లో వస్తుందని తెలుసు. కాని ఇంట్లో వద్దన్నారు, ఎలాగైనా మెడిసిన్ చదవాలని ఉంది కాబట్టి మళ్ళీ ఎంట్రెన్స్ రాయమని నాన్నగారు అన్నారు. నాకు రాయాలని లేదు. కానీ పైకి అనలేదు. అమ్మ పరోక్షంగా తిట్టింది.

ఆ రోజున చాలా ఏడ్చాను. అంతల్లాగా ఎప్పుడూ ఏడవలేదు. ఇలా ఎన్నిసార్లు రాయాలి. మళ్ళీ రాస్తాను, ఈసారి కూడా రాకపోతే, అమ్మా నాన్నగార్ల ఆశలని, అంచనాలని నీరు గార్చాననిపించింది. నాన్నగారు ఏమీ అనలేదు, కానీ మౌనంగా ఉన్నారు. ఏదైనా అన్నా బావుండేది. అమ్మ మాత్రం ఓ నాలుగు సార్లైనా అంది, ఇంకా కొంచెం కష్టపడాల్సిందేమో అని,.ఎవరెవరితోనో పోల్చడం మొదలెట్టింది. నామీద నాకు విరక్తి కలిగేలా మాట్లాడింది. నేనంటే ఇష్టం లేని ఇంట్లో నేనెందుకుండాలి. ఛస్తే పీడా పోతుందనిపించింది.

సీటు రానందుకు నాక్కూడా బాధగానే ఉంది. నిజానికి నేను ఎంతో కష్ట పడ్డాను. కాని రాలేదు ఇంకా కష్ట పడాలి అని అమ్మ ఎలా అనగలిగింది? నన్ను ఓదార్చకుండా వాళ్ళకి ఏదో అవమానం అయిపోయినట్లుగా ఎందుకు ఫీలయిపోతున్నారు ? నావైపు నుంచి కూడా ఆలోచించాలి, కష్టపడ్డావు కాని రాలేదు, ఏం చేస్తాం ,పరవాలేదు, ఏడవకు, జీవితం అంటే మెడిసినే అంతా కాదు. ఇప్పటికే మూడు సార్లు రాసావు. రాలేదు. పోనీలే ఈ బిఎస్సీ కూడా చదువే. అది పూర్తి చెయ్యి,అని ఎందుకు అనలేదు? ఎలాగూ బిఎస్సీ చదువుతున్నావు , అది అయిపోతే ఎమ్మెస్సీ చెయ్యచ్చు , అని కూడా ఎందుకు ఓదార్చలేదు ?

తలుచుకుంటున్నకొద్దీ అమ్మ మీద కోపం వచ్చేస్తోంది. వీళ్ళకి నా మీద ప్రేమ లేదు,నా రాంక్ మీద మాత్రమే ప్రేమ. నాకు మెడిసిన్ లో సీటు వస్తే నా మీద ప్రేమ చూపిస్తారా? ఒకవేళ మరోసారి రాసినా సీటు రాకపోతే, వాళ్ళ దృష్టిలో మరోసారి వేస్ట్ , నిజంగా నేను ఓ వేస్ట్ స్టూడెంటునా? నాకు తెలివి లేదా? నేను ఇంటెల్లిజెంట్ కాదా? మరి చిన్నప్పుడు నేను తెలివైనదానినని అందరికీ చెప్పి మురిసిపోయేది. అప్పుడు క్లాసులో ఫస్ట్ వచ్చాననా? మరి ఇప్పుడు మెడిసిన్ లో సీటు రావడం లేదనా? రాంక్ రావడం లేదనా? ఇంతేనా! ప్రతీసారీ నేను తెలివైన దానినని వీళ్ళ ముందు నిరూపించుకోవాల్సిందేనా? నాకు విలువ లేదా? నా మార్కుల కేనా విలువ? ప్రతీ తల్లిదండ్రులు ఇంతేనా? ఇలాగే ప్రవర్తిస్తారా?

ఈ రేసులూ, మార్కులూ, చదువులూ,ఎంసెట్లూ మా కుటుంబంలో మా మధ్య విలువలని చంపేసింది . ఇంట్లో వాళ్ళని చూస్తూంటేనే కోపం వచ్చేస్తోంది. మాట్లాడాలనిపించడం లేదు. వాళ్ళు కూడా ఓ మంచిమాట, ఓదార్పు మాట నాతో పంచుకోవడానికి ఇష్టపడడం లేదు. ఓ వారం రోజులు నాది మౌన పోరాటం.వాళ్ళది యుద్ధం. పరోక్షంగా విసురుతున్న మాటల బాణాల యుద్ధం. మాటలు ఎంత పదునుగా ఉంటాయో అమ్మ మాటలతో అర్థం అయింది. మళ్ళీ అనిపించింది ఛస్తే పీడా పోతుంది.

డిగ్రీ ఆఖరు సంవత్సరం చదవడానికి ఏ కాలేజీకి వెళ్ళాలో, ఎక్కడ చేర్పించాలో,అది దగ్గరుంటే బావుంటుందని,ఒక వేళ దగ్గర కాలేజీలో దొరకకపోతే మరో కాలేజీ , అమ్మా నాన్నా ఇలా నా చదువు గురించి, నేను చేరాల్సిన కాలేజి గురించి మాట్లాడు కుంటున్నారు, కానీ నన్నడగడంలేదు, పైగా అక్కడ నేనున్నానన్న విషయం కూడా లేనట్టుగా నేను ఏ కాలేజీలో చదవాలో మాట్లాడుకుంటుంటే,మళ్ళీ నాకు నేనే ఓ వేస్ట్ కాండడేట్ లా అనిపించాను. అసలు నేనేంచెయ్యాలో తెలియని అమ్మాయినా? నిజంగా నాకేం తెలియదా? నేను నిజంగా ఓ యూస్ లెస్ అమ్మాయినా? చెదిరిపోతున్న కలలు వాళ్ళని నన్నూ నిరాశపరిచాయి. మా మధ్య దూరం పెంచాయి, రిలేషన్స్ దెబ్బ తిన్నాయి. ఇప్పుడు మెడిసిన్ చదవడం అన్నది ఓ చెదిరిన కల. కాదు చెదిరిపోయిన కల. అది అలాగే నెరవేరకుండా ఉంటుందా?

“ కాలేజీలు మరో రెండు నెలల వరకూ తెరవరు. అంత వరకూ ఇంట్లో కూచోడం ఎందుకు. ఎంసెట్ కి ప్రిపేర్ అయిపో, ఈసారి ఎలాగైనా సీటు తెచ్చుకోవాలి. ఈలోపల ఇక్కడే ఫైనలియరు బిఎస్సీ చదువు ” అని అమ్మ అంది.

నేనేం చెయ్యాలో వాళ్ళకే సరిగా తెలీడం లేదు. ఓసారి ఓ మాట. మరోసారి మరోటి. ఆఖరికి కాలేజీలో చేరడం, ఎంసెట్ ప్రిపరేషన్ రెండూ, వాళ్ళే నిర్ణయించారు.

నేనేం చెయ్యాలో నన్నేమాత్రం సంప్రదించకుండా,దగ్గర్లో ఉన్నకోచింగ్ సెంటర్ లో చేర్పించడానికే నిశ్చయించుకున్నారు. వాళ్ళే నా చదువుని, నా కాలేజీని ,ఇంతకు ముందు నిర్ణయించినట్లే ఇప్పుడు కూడా నిర్ణయించేసారు.

కాలేజీలు తెరిచే లోపల ఎంసెట్ పెట్టేస్తారు. ఫుల్ టైం కోచింగ్ పగలు ఎంసెట్ కోచింగ్ సాయంత్రం మరో చోట కోచింగ్ అని ఓ బిజీ షెడ్యూల్ తయారు చేసారు. నేను వెళ్ళే కోచింగ్ సెంటర్ ఉన్న కాంప్లెక్స్ లోనే ఓ లైబ్రెరీ ఉంది. సహజంగా పుస్తకాలంటే ఉన్న ఇంట్రెస్ట్ తో మొదటి రోజే అందులోకి వెళ్ళాను. చూసాను. నాకు నచ్చింది. మెంబర్ అయ్యాను. కోచింగ్ ని వస్తూ ఏదో ఓ పుస్తకం తెచ్చుకుని చదివేదాన్ని. పుస్తకాలు చదువుతూంటే నేను చాలా విషయాలు మర్చిపోతున్నాను. ముఖ్యంగా ఆర్ణవ్ గురించినవి. పైగా నాలో ఏదో కొత్త మనిషి ప్రవేశించినట్లనిపితోంది. ఈ దశ నాకు బాగా ఉంది. అందుకే ఎక్కువ పుస్తకాలు ఎక్కువగా చదవడం మొదలెట్టాను.

ఓ వారం రోజులు గడిచే సరికి పుస్తకాలు అంటే అమితమైన ఇష్టం కలిగింది. ఎన్నో చదివాను. చదివి చదివి నాకూ ఆవేశం లాంటిది వచ్చేసింది. నాకు కూడా చిన్న చిన్న కవితలు వ్యాసాలు రాయాలన్న ఉత్సాహం కలిగింది. నేను ఆ రోజు సాయంత్రం లైబ్రెరీ నుంచి వస్తూ వస్తూ ,కనిపించిన, స్టేషనరీ షాపుకెళ్ళి, రెండు డైరీలు కొనుక్కొచ్చాను. కానీ రాయడం మొదలు పెట్టాకా ,రాసిన దానిని మరోసారి చదివాకా అర్థం అయింది.బాలేదనిపించింది. నేను రాసిందే నాకు నచ్చలేదు. నాకున్న భాషాపరిజ్ఞానం కవిత్వం రాయడానికి సరిపోదనిపించింది. అందుకని ఈసారి,ఇంగ్లీషు కావ్యాలు,కవితలూ తెలుగు కవిత్వానికి సంబంధించిన పుస్తకాలు తెచ్చుకోవాలని అను కున్నాను . అక్కడున్న పంతొమ్మిదో శతాబ్ధపు, ఇరవైయ్యో శతాబ్ధపు కవుల పుస్తకాలు తెచ్చుకుని చదవడం మొదలు పెట్టాక,అనిపించింది ,ఈ సాహిత్యం ఓ పెద్ద సముద్రం అని. ఆ సముద్రంలో ఈదడానికి ప్రయత్నించాను. ఆ ప్రభావంతో రాయడం మొదలు పెట్టాను. అంతే.

ఉత్సాహంతో రాత్రి కూడా రాయడం, నాకు తెలీకుండానే మొదలుపెట్టాను. రోజు రోజుకీ రాయాలన్న తపన , ఉత్సాహం ఎక్కువడంతో ఎక్కువ రాయడానికి ప్రయత్నిస్తున్నాను. పెద్దగా నిద్ర కూడా రావడం లేదు, ఎందుకో నిద్ర రావడం లేదు అనుకున్నాను కాని అదో రోగం అనుకోలేదు.

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments